వైఎస్సార్ సీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు



దుద్దుకూరులో ఎమ్మెల్యే బాలరాజును సన్మానించి కృతజ్ఞతలు తెలుపుతున్న పార్టీ మండల కన్వీనర్లు

బుట్టాయగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా కన్వీనర్ ఆళ్ల నాని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా బాధ్యతలు నిర్వహిస్తున్న వారిని గుర్తించి పార్టీ మండల కన్వీనర్లుగా నియమించడం జరిగిందని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. నియోజకవర్గంలో బుట్టాయగూడెం మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, జీలుగుమిల్లి మండల కన్వీనర్ చందా ప్రసాద్, పోలవరం మండల కన్వీనర్ బుగ్గా బురళీ కృష్ణ, కొయ్యలగూడెం మండల కన్వీనర్ గొడ్డాటి నాగేశ్వరరావు, టి.నర్సాపురం మండల కన్వీనర్ రామ రుద్రమరాజు (శ్రీను రాజు), కుక్కునూరు మండల కన్వీనర్ నరసింహరాజు ఆదివారం దుద్దుకూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బాలరాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి కృతజ్ఞతలు తెలపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు మాట్లాడుతూ వచ్చే ఎన్నికలు ఎంతో కీలకమైనవి అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైనాట్ 175 లక్ష్యంతో ముందుకు సాగుతున్నారని చెప్పారు. ప్రభుత్వం గడిచిన నాలుగేళ్లల్లో ప్రజాసంక్షేమం కోసం చేసిన కృషిని ప్రజలకు మరింత అవగాహన కల్గించే విధంగా పార్టీ మండల కన్వీనర్లు కృషి చేయాలన్నారు. పార్టీ నాయకులను, కార్యకర్తలను, స్థానిక ప్రజాప్రతినిధులను, జేసీఎస్ కన్వీనర్లను అందరినీ సమన్వయంతో కలుపుకుని ముందుకుసాగుతూ పార్టీ గెలుపునకు కృషి చేయాలని బాలరాజు కోరారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా కన్వీనర్ ఆళ్ల నాని, ఎమ్మెల్యే బాలరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అన్ని మండలాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

దేశ చరిత్రలోనే ప్రతి గడపకూ ఆరోగ్య సేవలు అందించేందుకు కృషి చేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని దుద్దుకూరులో ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఇప్పటి వరకూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా కృషి చేసిన సీఎం వైఎస్ జగన్ ఇకపై ప్రతి ఇంటా ఆరోగ్యవంతులు ఉండాలనే సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి పేదలకు మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య పరీక్షలు



జంగారెడ్డిగూడెంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యపరీక్షలు, సర్వే కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా అవసరమైన వివరాల కోసం ఏఎన్ఎంలు, ఆశాలు, వలంటీర్లు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వైద్యపరీక్షలు నిర్వహించడంతో పాటు, కుటుంబ సభ్యుల ఆరోగ్య వివరాలను సేకరిస్తున్నారు. దీనిలో భాగంగా జంగారెడ్డిగూడెం పట్టణంలో ఆదివారం ఆయా సచివాలయాల పరిధిలో ఏఎన్ఎంలు, ఆశాలు సర్వే నిర్వహించి, వైద్యపరీక్షలు నిర్వహించారు.

క్లుప్తంగా

వాలీబాల్ కిట్ల అందజేత



యువకులకు వాలీబాల్ కిట్లను అందజేస్తున్న దృశ్యం

పోలవరం రూరల్: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకుని రాణించాలని టీబీఆర్ ఫౌండేషన్ సభ్యులు అన్నారు. పోలవరం మండలం పాత పట్టిసీమలో ఆదివారం యువతకు వాలీబాల్ కిట్‌లను వారు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా, క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలన్నారు. ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆదేశాల మేరకు వాలీబాల్ కిట్‌లు అందజేసినట్లు చెప్పారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పాడుం శ్యామ్‌కుమార్, పోలవరం మండల సచివాలయ కన్వీనర్ మాదేపల్లి సాయి రామకృష్ణ, ఈదేపల్లి వెంకట గణేష్ పాల్గొన్నారు.

ఘనంగా వృద్ధుల దినోత్సవం



చింతలపూడిలో ఓటర్లను సన్మానిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ఆదివారం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించారు. జంగారెడ్డిగూడెం బాపూజీ సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ కుకునూరి రామచంద్రరావు మాట్లాడుతూ వృద్ధుల పరిరక్షణ చట్టం 2007ను పటిష్ఠంగా అమలు చేయాలన్నారు.

వృద్ధులకు సన్మానం

కొయ్యలగూడెం: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని తహసీల్దార్ కార్యాలయంలో వృద్ధులకు ఆదివారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ పాసం నాగమణి ఆధ్వర్యంలో 80 సంవత్సరాల వయసుగల నలుగురు వృద్ధులను శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

చింతలపూడి: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 80 సంవత్సరాల వయస్సు దాటిన ఓటర్లను సన్మానించినట్లు తహసీల్దార్ కృష్ణ జ్యోతి తెలిపారు.

15 నుంచి దసరా ఉత్సవాలు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం గ్రామ దేవత శ్రీ గంగానమ్మ అమ్మవారి దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు అక్టోబర్ 15 నుంచి 23వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు గంగానమ్మ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 15వ తేదీ నుంచి తొమ్మిదిరోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి విశేష పూజలు నిర్వహించడంతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. 25వ తేదీన గ్రామోత్సవం, 26న శేషవస్త్రాల వేలం, 27న చండీహోమం, 28వ తేదీన లడ్డూ వేలం, మహా అన్నసమారాధన కార్యక్రమాలు ఉంటాయన్నారు. దసరా ఉత్సవాలలో ప్రతిరోజు ఆలయంలో శ్రీలలితా సహస్రనామ పారాయణ, విష్ణు సహస్రనామ పారాయణ, విశేష కుంమార్చన, సాయంత్రం వేదపండితులచే శాంతిహోమం నిర్వహిస్తామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'మానవత'కు దాతలు విరాళాలు అందించాలి



ఫ్రీజర్లు బహూకరించిన దాతలకు సత్కారం

కామవరపుకోట: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మరిన్ని సేవలు అందించేందుకు దాతలు విరాళాలు అందించి సహకరించాలని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉభయగోదావరి జిల్లాల అధ్యక్షుడు తాడేపల్లి రామ్మోహన్‌రావు కోరారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఫ్రీజర్లు భద్రపరచుటకు, దాతల సహకారంతో రూ.లక్షా యాభై వేలతో నిర్మించిన నూతన భవనాన్ని ఆదివారం ప్రారంభించారు. అనంతరం ఫ్రీజర్లు బహూకరించిన దాతలను సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ సాయిన కనకరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మిడతా రమేష్ బాబు, ఎంపీటీసీ బొల్లు వెంకట సత్యనారాయణ, మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల అధ్యక్షుడు సాయిబాబు పాల్గొన్నారు.

జై జై గణేశా..



వేలంలో లడ్డూను దక్కించుకున్న భక్తులు

కొయ్యలగూడెం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా స్థానిక కోపరేటివ్ బ్యాంకు వీధిలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహాన్ని ఆదివారం ఘనంగా ఊరేగించి నిమజ్జనం చేశారు. ముందుగా రెండు వేల మందికి పైగా భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు. అనంతరం యువకులు పోటీపడి స్వామివారి లడ్డూ ప్రసాదాలను వేలంలో దక్కించుకున్నారు.

వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుల నియామకం



కామవరపుకోట మండల అధ్యక్షుడు రమేష్‌బాబును సత్కరిస్తున్న దృశ్యం



తోచలకరాయుడుపాలెంలో కొఠారి మోహన్‌కు సత్కారం



శ్రీనురాజు, టి.నరసాపురం మండలాధ్యక్షుడు

టి.నరసాపురం: వైఎస్సార్ సీపీ టి.నరసాపురం మండల అధ్యక్షుడిగా ఎస్‌వీపీకేహెచ్ శ్రీను రాజు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ జిల్లా కమిటీ నుంచి నియామక పత్రాన్ని ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీను రాజు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి రెండోసారి బాధ్యతలు అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, జిల్లా కార్యవర్గం, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపునకు తన వంతు కృషిచేస్తానని చెప్పారు.

లింగపాలెం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ లింగపాలెం మండల అధ్యక్షుడిగా నియమితులైన కొఠారి మోహన్‌ను తోచలకరాయుడుపాలెంలో ఆదివారం పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కొఠారి మోహన్ మాట్లాడుతూ మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. తనకు బాధ్యతలు అప్పగించిన సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డికి, ఏలూరు జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆళ్లనాని, ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజాకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లింగపాలెం, కామవరపుకోట జెడ్పీటీసీలు వడ్లాని హరినాథ్‌రాజు, కిమిడి రమేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ మేడవరపు అశోక్, సొసైటీ అధ్యక్షుడు ఉప్పలపాటి వరప్రసాద్, రెడ్డిన శ్రీను, మాజీ జెడ్పీటీసీ కట్టా సత్యన్నారాయణ, లిడ్ క్యాప్ డైరెక్టర్ సొంగా సందీప్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కామవరపుకోట: కామవరపుకోట మండలం వైఎస్సార్ సీపీ అధ్యక్షునిగా మిడతా రమేష్ బాబు నియమితులయ్యారు. తనకు రెండో సారి బాధ్యతలు అప్పగించిన సీఎం వైఎస్ జగన్, ఎంపీ కోటగిరి శ్రీధర్, ఎమ్మెల్యే ఎలీజాకు రమేష్‌బాబు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను సత్కరించి అభినందనలు తెలిపారు. చింతలపూడి ఏఎంసీ మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, జెడ్పీటీసీ కడిమి రమేష్, కామవరపుకోట ఉప సర్పంచ్ మేడూరి రంగబాబు, సొసైటీ చైర్మన్ కనకరాజు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో జంగారెడ్డిగూడెం విద్యార్థుల సత్తా



వట్టికూటి సత్య సురేంద్ర



ఎం.విజయ దుర్గాప్రసాద్



వాలీబాల్ ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెంకు చెందిన విద్యార్థులు అథ్లెటిక్స్‌లో సత్తా చాటినట్లు వ్యాయామ ఉపాధ్యాయులు డి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. సెప్టెంబర్ 21, 22, 23 తేదీల్లో గుంటూరు నాగార్జున యూనివర్సిటీ నందు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో వట్టికూటి సత్య సురేంద్ర 400 మీటర్ల విభాగంలో ప్రథమ స్థానం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నాడు. అదేవిధంగా 200 మీటర్ల పరుగులో రాష్ట్రస్థాయిలో కాంస్య పతకం సాధించాడు. అక్టోబర్ 15న వరంగల్ జిల్లా హనుమకొండ నందు జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడని రాజేంద్రప్రసాద్ తెలిపారు. మరో విద్యార్థి మాకిరెడ్డి విజయ దుర్గప్రసాద్ రాష్ట్రస్థాయి పరుగు పందెంలో 10 కిలోమీటర్ల రన్నింగ్ నందు కాంస్య పతకాన్ని, 5 కిలోమీటర్ల రన్నింగ్ నందు 5వ స్థానం సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులను పలువురు అభినందించారు.

వాలీబాల్ పోటీలకు గవరవరం విద్యార్థులు

కొయ్యలగూడెం: రాష్ట్రస్థాయి వాలీబాల్, ఖోఖో పోటీలకు తమ విద్యార్థులు ముగ్గురు ఎంపికైనట్లు గవరవరం వెంకటపతి రాజు ఎడ్యుకేషనల్ సంస్థల కరస్పాండెంట్ ఎస్ఆర్ఆర్ సుభద్రాదేవి ఆదివారం పేర్కొన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థాయిలో తణుకు పట్టణం ఎస్‌కే ఎస్‌డీ మహిళా కళాశాలలో జిల్లాస్థాయి అండర్–19 పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో జి.లాస్య ప్రియ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు, రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకి ఎస్.రాణి, పి.కల్యాణి ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను మాజీ సర్పంచ్ నరసింహారాజు, ప్రిన్సిపాల్ నారా కేశవరావు అభినందించారు.

నేడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గాంధీ జయంతి

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే ఎలీజా ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు తెలిపారు.

పరిశుభ్రతలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలి



జంగారెడ్డిగూడెం : డీపీఆర్‌వో కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



పోలవరం : స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



లింగపాలెం : పరిసరాలను శుభ్రం చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



కామవరపుకోట: గ్రామస్తులకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ అనూష, పంచాయతీ సిబ్బంది



చింతలపూడి: శ్రమదానం చేస్తున్న జెడ్పీ సీఈఓ రవికుమార్, ఎంపీపీ రాంబాబు నాయక్



కొయ్యలగూడెం: అంకాలగూడెంలో గ్రామస్తులు, రైతుల మానవహారం

చింతలపూడి: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములుకావాలని జిల్లా పరిషత్ సీఈఓ రవికుమార్ పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపు మేరకు ఆదివారం చింతలపూడి పట్టణంలో నగర పంచాయతీ ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్‌లో మహాత్మా గాంధీ విగ్రహానికి ఎంపీపీ బి రాం బాబు నాయక్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ బొమ్మ సెంటర్ వద్ద నుంచి బోసుబొమ్మ సెంటర్ వరకు శ్రమదానం నిర్వహించారు. చీపుర్లు పట్టి మెయిన్ రోడ్డును ఊడ్చి క్లీన్ చేశారు. ఈ సందర్భంగా పరిశుభ్రత, తడిచెత్త, పొడిచెత్త, ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కలిగించారు. అదే విధంగా మండలంలోని ప్రగడవరం, యర్రగుంటపల్లి గ్రామాల్లో కూడా స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షుడు దా బి.రాం బాబు నాయక్, నగర పంచాయితీ కమిషనర్ ఎస్ రాంబాబు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు కొప్పుల నాగేశ్వరరావు, ఐకేపీ మహిళలు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

జంగారెడ్డిగూడెం: పరిసరాలు శుభ్రంగా ఉన్నప్పుడే మనం ఆరోగ్యంగా ఉండగలుగుతామని, కావున ప్రతి ఒక్కరూ వారి చుట్టుపక్కల ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జంగారెడ్డిగూడెం మున్సిపల్ వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, కౌన్సిలర్ నేకూరి కిషోర్ అన్నారు. జంగారెడ్డిగూడెం డీఎల్‌పీవో కార్యాలయం వద్ద స్వచ్ఛతా లీగ్ 2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అలాగే మున్సిపాలిటీ పరిధిలోని అన్ని సచివాలయాల వార్డుల్లో ఆదివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన స్వచ్ఛ భారత్ మిషన్ కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు కమిషనర్ భవానీప్రసాద్ తెలిపారు.

పోలవరం రూరల్: మండలంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు, సచివాలయాల పరిధిలోని ప్రాంతాల్లో పరిసరాలు పరిశుభ్రం చేశారు. పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గూటాల్లో ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి కొత్త పట్టిసీమలో సర్పంచ్ మైగాపుల విజయ్‌దుర్గ, పోలవరంలో సర్పంచ్ పాడెం పుష్ప, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బుగ్గ మురళీకృష్ణ, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ బి.సుమతి, సిబ్బంది ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు

లింగపాలెం: ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని అంటువ్యాధులకు దూరంగా ఉండాలని ఎంపీడీఓ ఎస్ ఆశీర్వాదం ప్రజలను కోరారు. ఆదివారం లింగపాలెంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామ సచివాలయంలో, మండల కార్యాలయ ఆవరణలలో ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, కార్యదర్శులు పాల్గొని గ్రామాల్లో చెత్తను తొలగించారు. ఆచెత్తను సంపద కేంద్రాలకు తరలించారు. గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. లింగపాలెం సర్పంచ్ తగరం హేమలత, మండల వైఎస్సార్ సీపీ ముఖ్యనేత ముసునూరి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు భీమిరెడ్డి ప్రభాకరెడ్డి, చిలుకూరి సత్యన్నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

కామవరపుకోట: పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని కామవరపుకోట సర్పంచ్ కర్రిపోతు అనూష అన్నారు. ఆదివారం స్వచ్ఛతా హీ సేవ శ్రమదాన్ కార్యక్రమంలో భాగంగా కామవరపుకోట పంచాయతీలో సిబ్బందితో కలిసి పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామస్తులకు పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. సర్పంచ్ అనూష మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మీ ఇంటి పరిసర ప్రాంతాలలో చెత్తా, చెదారం, మురుగునీరు లేకుండా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేడూరు రంగబాబు, రాష్ట్ర ముదిరాజ్ సంఘ డైరెక్టర్ చిక్కుల శ్రీను, వైస్ ఎంపీపీ తమ్మిశెట్టి గిరిజ, ఎంపీటీసీ పోలిమెట్ల ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం అంకాలగూడెం గ్రామంలో ఆదివారం నిర్వహించారు. వర్జీనియా పొగాకు వేలం కేంద్రం అధికారి గ్రేసీ మార్గరెట్ ఆధ్వర్యంలో సిబ్బంది గ్రామ ప్రజలు రైతులు పాల్గొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మానవహారం నిర్మించి పర్యావరణానికి స్వచ్ఛతను అందిస్తాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఎంపీపీ గంజిమాల రామారావు, ఎంపీడీవో ఆర్.బేబీ శ్రీలక్ష్మి స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొన్నారు. బస్టాండ్ ప్రాంగణంలో రోటరీ సభ్యులు శ్రమదానం నిర్వహించారు.

గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు

జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరం పంచాయతీ వద్ద స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఓటర్లను సత్కరించారు. గ్రామంలోని పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఆర్డీవో ఝాన్సీ రాణి, ఎంపీపీ కొదమ జ్యోతి, సర్పంచ్ గెల్లా వెంకట రమణ, ఎంపీడీవో కె.విజయ్ ప్రసాద్, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు నిమ్మ గురునాధరెడ్డి, చిల్లా దుర్గారెడ్డి, వందనపు సూర్యప్రకాషరావు, దల్లి నాగేశ్వరరావు, మల్లెల్లి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. పుట్లగట్లగూడెంలో గ్రామంలో చేపట్టిన ర్యాలీని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు ప్రారంభించారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి శ్రమదానం చేపట్టారు.

బుట్టాయగూడెం: స్వచ్ఛతా హీ సేవలో భాగంగా ఆదివారం మండలంలోని అన్ని గ్రామ సచివాలయాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రతపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని గ్రామాల్లోని వీధుల్లో చెత్తను శుభ్రం చేశారు. రాజానగరం సచివాలయం పరిధిలో గిరిజన సంక్షేమ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి విద్యార్థులు, సర్పంచ్ దుర్గ ఆధ్వర్యంలో చెత్తను శుభ్రం చేశారు. బుట్టాయగూడెంలో ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి సర్పంచ్‌లు తెల్లం వెంకాయమ్మ, సరియం లక్ష్మి, ఈఓపీఆర్‌డీ శ్రీహరి, ఏఓ బేబీ సరోజిని, ఏపీఎం పద్మావతి, అలాగే లక్ష్మ్ముడుగూడెం సచివాలయ పరిధిలో సర్పంచ్ మడకం రామలక్ష్మి వీధుల్లో ర్యాలీ నిర్వహించి చెత్తను శుభ్రం చేశారు.

ద్వారకాతిరుమల: మండలంలోని ప్రతి పంచాయతీలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లోని డ్రెయినేజీలను శుభ్రం చేయడంతో పాటు, రహదార్లపై ఉన్న చెత్తా, చెదారాన్ని తొలగించారు. దొరసానిపాడులో పంచాయతీ కార్యదర్శి రామలక్ష్మి ఆధ్వర్యంలో స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని డ్రెయినేజీల్లో మురుగును తొలగించారు. డంపింగ్ యార్డును శుభ్రం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్కాబత్తుల సిద్ధిరాజు, ఎంపీటీసీ అల్లాడ హరేరామకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు దిర్సిపాం అన్నవరం, డీజే రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



జంగారెడ్డిగూడెం రూరల్: పుట్లగట్లగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు హరిబాబు



బుట్టాయగూడెం: కొమ్ముగూడెం సెంటర్‌లో చెత్తను శుభ్రం చేస్తున్న దృశ్యం



ద్వారకాతిరుమల : దొరసానిపాడులో డ్రెయినేజీని శుభ్రం చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు